బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ ప్రథమ మహాసభలో మాట్లాడుతున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు. చిత్రంలో ఆలిండియా న్యూస్ పేపర్ వెండర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు సునీల్ పాతంకర్, నమస్తే తెలంగాణ సర్క్యులేషన్ జీఎం రాంరెడ్డి, తెలంగాణ ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వనమా సత్యం తదితరులు

పేపర్‌బాయ్స్ సమస్యలు పరిష్కరిస్తా

- నేనూ ఆ కష్టాలు అనుభవించా
- మీడియా పరిస్థితులు తెలుసు
- ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు
- ఘనంగా రాష్ట్ర ప్రింట్ మీడియా..
- ఎస్వీకేలో ఘనంగా డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ ప్రథమ మహాసభ
- పేపర్ గర్ల్స్ ప్రమీల, పవిత్రకు సన్మానం

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 16 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ డిమాండ్‌లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి సమస్యలన్నీ పష్కారమయ్యేందుకు కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు హామీ ఇచ్చారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ ప్రథమ మహాసభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే బొజ్జూ మాట్లాడుతూ.. తాను కూడా గతంలో పేపర్ బాయ్‌గా పనిచేశానని.. ఈ రంగంలో ఉన్న కష్టాలన్నీ అనుభవించానని చెప్పారు. యాజమాన్యాల ఆదేశాలతో ఏజెంట్లు.. వారి ఆదేశాలతో పేపర్ బాయ్స్ టాస్క్ పూర్తి చేయడంలో నతమతమవుతున్నారని అన్నారు. 'నేను పేపర్ బాయ్ నుంచి ఎమ్మెల్యేగా ఎదగడం చాలా గర్వంగా ఉంది. నా డిగ్రీ సమయంలో పేపర్ వేసేవాణ్ని. అప్పుడు నెలకు రూ.3 వందల వరకు ఇచ్చేవాళ్లు. అలా కష్టపడి చదువుకున్నాను. ఓ పత్రికలో రిపోర్టర్‌గా కూడా పనిచేసిన అనుభవం నాకుంది. ఈ రంగం నాకు కష్టాలను ఎదుర్కోవడం నేర్పించింది' అని చెప్పారు. మీడియా ప్రజల తరపున ఉండాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి తనను నమ్మి అవకాశం ఇవ్వడం గొప్ప విషయమని చెప్పారు. అసోసియేషన్ సమస్యలన్నింటిని సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా పని చేస్తానని భరోసా ఇచ్చారు.

ఉద్యమాల ద్వారానే సమస్యల పరిష్కారం

ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని ఆలిండియా న్యూస్ పేపర్ వెండర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు సునీల్ పాతంకర్ చెప్పారు. మహారాష్ట్రలో అనేక ఉద్యమాలు చేసి పేపర్ బాయ్స్ కోసం ప్రభుత్వం సేఫ్టీ షెడ్‌లను ఏర్పాటు చేసేలా కృషి చేశామని చెప్పారు. వెల్ఫేర్ బోర్డు ఏర్పాటుకు కూడా ప్రభుత్వం అధ్యయన కమిటీ వేసి నివేదికను శాసనసభకు అందించిందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ రంగానికి చెందిన వారందరూ ఐక్యంగా ఉంటూ సమస్యలు పరిష్కరించుకోవాలని అన్నారు. తెలంగాణ ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వనమా సత్యం మాట్లాడుతూ.. కరోనా లాంటి క్లిష్ట సమయంలో ప్రజలకు పేపర్ చేర్చిన ఘనత పేపర్ బాయ్స్‌ది అని కొనియాడారు. డిస్ట్రిబ్యూటర్స్ కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వారికి విద్యుత్తు వాహనాలను కూడా సమకూర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన ఉందని అన్నారు. ప్రతి జిల్లాలో డిస్ట్రిబ్యూటర్‌కో ఆపరేటివ్ సొసైటీలు ఏర్పాటుచేసి రుణాలు ఇప్పించాలని కోరారు. ప్రతి జిల్లాలో పత్రికల అమ్మకందార్లకు స్ఫూర్తిగా దివంగత రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. నమస్తే తెలంగాణ దినపత్రిక సర్క్యులేషన్ జీఎం రాంరెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటివరకు ఉద్యమం కోసం పని చేశామని ఇకపై మ నకోసం పనిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇప్పటివరకు హైదరాబాద్‌కే పరిమితమైన కార్యకలాపాలను రాష్ట్రవ్యాప్తంగా తీసుకపోవడం గొప్ప విషయమని అన్నారు. ఈ రంగంలో మనకు ఆశించిన స్థాయిలో గుర్తింపు లేదని.. ఇకపై గుర్తింపు వచ్చేలా అం దరూ ఐక్యతతో పనిచేయాలని సూచించారు. పేపర్ గర్ల్స్ ప్రమీల, పవిత్ర సిస్టర్స్‌ను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు శాలువతో సత్కరించారు. అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలిండియా న్యూస్ పే పర్ ఏజెంట్ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి పీకే సత్తార్, దినపత్రికల జీఎంలు, జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రాణాలు తీసిన పతంగుల సరదా

- విద్యుత్తు తీగల్లోని పతంగులు తీస్తూ ప్రమాదాలకు గురైన పిల్లలు
- కాటేదాన్‌లో బాలుడి మృతి
- కోరుట్లలో ఇద్దరికి గాయాలు
- రహ్మత్‌నగర్‌లో లిఫ్టుగుంతలో పడి యువకుడి మృతి

వివేక్ (ఫైల్)

న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ: సంక్రాంతి పండుగ వేళ సరదాగా పతంగులు ఎగురవేసిన పలువురు పిల్లలు ప్రమాదాల బారిన పడ్డారు. విద్యుత్తు తీగలకు తగిలిన పతంగులను తీసుకొనే క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యారు. వేర్వేరు ఘటనల్లో ఇద్దరు చనిపోగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. మైలార్‌దేవ్‌పల్లి ఠాణా పరిధిలోని కాటేదాన్‌కు చెందిన సంతోష్- శ్రావంతి దంపతుల కుమారుడు వివేక్ (10) చిన్నారులతో కలిసి గాలిపటాలు ఎగరవేస్తున్నాడు. విద్యుత్తు తీగలకు తగిలిన పతంగిని తీసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. వివేక్‌ను హుటాహుటిన దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్లు నిర్ధారించారు. జగిత్యాల జిల్లా కోరుట్లలో గాలిపటం తెగి పక్కనే హైటెన్షన్ విద్యుత్తు తీగలకు చుట్టుకోవడంతో తీసేందుకు యత్నించిన ఇద్దరు స్కూల్ పిల్లలు కరెంట్ షాక్‌కు గురయ్యారు. ఒకరికి ముఖం, కాళ్లు, చేతులు కాలిపోగా అపస్మారకస్థితికి చేరుకున్నాడు. మరొకరు దాబాపై నుంచి కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. కామారెడ్డి జిల్లా బాన్సువాడలో కరణ్‌సింగ్ (25) గాలిపటం ఎగురవేయగా, దారం తెగిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చిక్కిన గాలిపటాన్ని తీసే క్రమంలో అదుపు తప్పి ట్రాన్స్‌ఫార్మర్‌పై పడటంతో కరణ్‌సింగ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇది గమనించిన ఆటోడ్రైవర్లు పరుగున వచ్చి కరెంట్ సరఫరా నిలిపివేశారు. తీవ్రంగా గాయపడిన కరణ్‌సింగ్‌ను బాన్సువాడ ఏరియా దవాఖానకు తరలించారు. మధురానగర్ పోలీస్ పరిధిలోని రహ్మత్‌నగర్‌కు చెందిన కపిల్‌దేవ్ (23) సోమవారం స్నేహితులలో ఐదు అంతస్థుల భవనంపైకి ఎక్కి పతంగులు ఎగురవేశాడు. 3వ అంతస్థులో మెట్లు దిగుతూ ప్రమాదవశాత్తు లిఫ్ట్ కోసం ఏర్పాటు చేసిన గుంతలో పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన కపిల్‌దేవ్‌ను యూసుఫ్‌గూడలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

భార్య తల నరికిన భర్త

- అనుమానంతో ఘాతుకం
- జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో దారుణం
- అనాథలుగా మారిన ఇద్దరు పిల్లలు

సువర్ణ (ఫైల్)

పెద్దఅంబర్‌పేట, జనవరి 16: అనుమానంతో కట్టుకున్న భార్యనే కడతేర్చాడు. కత్తితో తల, మొండెం వేరు చేసి అతి దారుణంగా చంపేశాడు. ఈ దారుణ ఘటన రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ ఠాణా పరిధిలోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో మంగళవారం చోటుచేసుకున్నది. పురాణాపూల్‌కు చెందిన పుష్పలత అలియాస్ సువర్ణ (42)తో సికింద్రాబాద్‌కు చెందిన విజయ్‌కుమార్‌కు 2009లో పెండ్లి జరిగింది. పుష్పలత కంటే విజయ్ వయసులో ఆరేండ్లు చిన్న. పుష్పలతకు ఇది మూడోది, విజయ్‌కి తొలి వివాహం. విజయ్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. సరూర్‌నగర్‌తోపాటు పలు ప్రాంతాల్లో వీరు నివసించారు. 2 నెలల కిందటే జేఎన్‌ఎన్‌యూఆర్‌ం కాలనీలోకి మారారు. చాలాకాలంగా పుష్పలత ప్రవర్తనపై తరచూ దంపతుల మధ్య గొడవలు జరిగేవి. విజయ్‌పై పుష్పలత మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో గృహహింస కేసు పెట్టింది. పుష్పలతపై విజయ్ అనుమానం పెంచుకున్నాడు. చెప్పినా ఆమె తీరు మార్చుకోకపోవడంతో ఆమెను చంపాలని విజయ్ నిర్ణయించుకున్నాడు. మంగళవారం అదే కాలనీలోని డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయంలోని తన సోదరి ఫ్లాట్‌ను శుభ్రం చేసేందుకు పుష్పలతను తీసుకెళ్లాడు. అప్పటికే సిద్ధం చేసుకున్న కత్తితో ఆమెను చంపేశాడు. కత్తితో కోసి తల, మొండెంను వేరుచేసి అతి దారుణంగా హత్య చేశాడు. తల్లి మరణం, తండ్రి జైలు పాలవ్వడంతో 13 ఏండ్ల కొడుకు, తొమ్మిదేండ్ల కుమార్తె ఇద్దరు అనాథలయ్యారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు తెలిసింది.

విషమంగా తమ్మినేని ఆరోగ్యం

- మాజీ మంత్రి హరీశ్‌రావు పరామర్శ

ఏఐజీ దవాఖానలో తమ్మినేనిని పరామర్శిస్తున్న హరీశ్‌రావు

కొండాపూర్, జనవరి 16: గుండెపోటుతో గచ్చిబౌలిలోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ (ఏఐజీ)లో చేరిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆరోగ్యం విషమంగా ఉంది. ఆయన ఆరోగ్య పరిస్థితిపై దవాఖాన యాజమాన్యం బులెటిన్ విడుదల చేస్తూ తమ్మినేనిని వెంటిలేటర్ సాయంతో దవాఖానకు తీసుకొచ్చినట్టు పేర్కొంది. ఆయన గుండె, కిడ్నీ, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్నట్టు తెలిపింది. ఊపిరితిత్తుల నుంచి నీటిని తొలగించేందుకు డాక్టర్ సోమరాజు, డాక్టర్ డీఎన్ కుమార్ పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతున్నట్టు పేర్కొంది.

హరీశ్‌రావు పరామర్శ

గుండెపోటుతో ఏఐజీ దవాఖానలో చేరిన వీరభద్రంను మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మంగళవారం పరామర్శించారు. వైద్యులను అడిగి ఆయన ఆరోగ్య పరిస్థితిపై తెలుసుకున్నారు. తమ్మినేని వేగంగా కోలుకొని ప్రజాసేవలో ముందుకు సాగాలని హరీశ్‌రావు ఆకాంక్షించారు.

పన్నుల వ్యవస్థ సరళంగా ఉండాలి

- సత్యసాయి జిల్లాలో నాసిన్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ

లేపాక్షి ఆలయంలో రంగనాథ రామాయణాన్ని వీక్షిస్తున్న ప్రధాని మోదీ

హైదరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): పన్నుల వ్యవస్థ సరళంగా ఉండాలని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఏపీలోని శ్రీసత్యసాయి జిల్లాలో ఏర్పాటుచేసిన జాతీయ కస్టమ్స్, పరోక్ష పన్నులు, నార్కొటిక్స్ అకాడమీ(నాసిన్)లను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. వెనుకబడిన సత్యసాయి జిల్లాలో నాసిన్ ఏర్పాటు చేశామని, అది ప్రముఖ శిక్షణా సంస్థగా, సుపరిపాలనకు సరికొత్త కేంద్రంగా మారనుందని తెలిపారు. నాసిన్ దేశంలో ఆధునిక ఎకోసిస్టంగా మారనుందని, ఇక్కడ జరిగే ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో ఎంతో ప్రయోజనం కలగనుందని తెలిపారు. భూమి నీటిని గ్రహించి ఆవిరై తిరిగి వర్షంగా కురిసినట్టు పన్నుల విధానం ఉండాలని చెప్పారు. జీఎస్టీ రూపంలో ఆధునిక పన్నుల వ్యవస్థ తెచ్చామని తెలిపారు. ఆదాయపన్ను చెల్లింపు విధానాన్ని సులభతరం చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ముగ్గురు పిల్లల తల్లిని ఎత్తుకెళ్లే యత్నం

- అడ్డుకోబోయిన భర్తను కత్తితో పొడిచి చంపిన ప్రేమోన్మాది
- ఫిలింనగర్ ఠాణా పరిధిలో దారుణం

బంజారాహిల్స్, జనవరి 16: ముగ్గురు పిల్లల తల్లిని ఓ యువకుడు బలవంతంగా ఎత్తుకెళ్లబోయాడు. అతడి దౌర్జాన్యాన్ని అడ్డుకోబోయిన భర్త చాతీపై ప్రేమోన్మాది కత్తితో పొడవటంతో ఆయన ప్రాణాలు కోల్పోయాడు. ఈ దారుణ ఘటన ఫిలింనగర్‌లో చోటు చేసుకొన్నది. పోలీసుల వివరాల ప్రకారం.. షేక్‌పేట జైహింద్ కాలనీకి చెందిన వివాహిత (31) 2022లో ఉన్నత విద్య కోసం లండన్‌కు వెళ్లింది. 4 నెలల తర్వాత ఆమె భర్త గౌస్ మొయినొద్దీన్ ముగ్గురు పిల్లలతో అక్కడికి వెళ్లాడు. కొన్నాళ్ల తర్వాత గౌస్ పిల్లలతో కలిసి ఇండియాకు తిరిగివచ్చాడు. చదువుకోసం భార్య అక్కడే ఉండి నిరుడు నవంబర్‌లో తిరిగొచ్చింది. లండన్‌లో ఉన్న సమయంలో అతడితోపాటు షేరింగ్ అకమిడేషన్‌లో అపార్ట్‌మెంట్‌లో ఉన్న వివాహితకు అక్కడే ఉంటున్న హైదరాబాద్‌వాసి అద్నాన్ హుస్సేన్ అనే యువకుడు పరిచయమయ్యాడు. ఇండియాకు వచ్చిన తర్వాత తరచూ ఫోన్లు చేయడం, భర్తను వదిలిపెట్టి వచ్చి పెళ్లి చేసుకోవాలంటూ ఒత్తిడి చేయడం ప్రారంభించాడు. అద్నాన్ వేధింపులను భర్తకు కూడా చెప్పింది. ఈ నెల 14న రాత్రి అద్నాన్ ఇంట్లోకి ప్రవేశించి గౌస్ భార్యను లాక్కొని తీసుకెళ్లేందుకు యత్నించాడు. ఆమెను బైక్‌పై ఎక్కించేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో గౌస్ అద్నాన్‌ను అడ్డుకున్నాడు. అద్నాన్ తన వద్ద ఉన్న కత్తితో గౌస్ చాతీ మీద పొడిచాడు. తీవ్రంగా గాయపడిన గౌస్‌ను దవాఖానకు తరలించగా ఆదివారం రాత్రిమృతి చెందారు. ఫిలింనగర్ పోలీసులు దర్యాప్తుకేసు చేపట్టారు. అద్నాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

3 నెలల్లో ట్రిపుల్‌ఆర్ భూసేకరణ

- ఆ వెంటనే టెండర్లు పిలవాలని సీఎం ఆదేశం

హైదరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్‌ఆర్) ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణను 3 నెలల్లో పూర్తి చేయాలని, ఇతర అడ్డంకులను అధిగమించేందుకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్) వెలుపల నిర్మించ తలపెట్టిన ట్రిపుల్‌ఆర్ ప్రాజెక్టులో ఉత్తర భాగం నిర్మాణానికి అవసరమైన 1,935.35 హెక్టార్లలో ఇప్పటికే 1,459.28 హెక్టార్ల భూసేకరణ పూర్తయింది. దీంతో మిగిలిన భూసేకరణను త్వరగా పూర్తిచేసి, పనులకు టెండర్లు పిలవాలని సీఎం ఆదేశించారు. ట్రిపుల్‌ఆర్ దక్షిణ భాగాన్ని జాతీయ రహదారిగా ప్రకటించి, భూసేకరణ ప్రణాళికను రూపొందించాలని ఎన్‌హెచ్‌ఏఐని కోరారు. ట్రిపుల్‌ఆర్ ప్రాజెక్టు పూర్తి కోసం ఆర్థికంగా ఎంత భారమైనా భరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేసేందుకు తెలంగాణను 3 క్లస్టర్లుగా విభజించాలని ప్రభుత్వం యోచిస్తున్నది. హైదరాబాద్ ఓఆర్‌ఆర్ లోపల ఉన్న ప్రాంతాన్ని అర్బన్ క్లస్టర్‌గా, ఓఆర్‌ఆర్-ట్రిపుల్‌ఆర్ మధ్యలో ఉన్న ప్రాంతాన్ని సెమీ అర్బన్ క్లస్టర్‌గా, ట్రిపుల్‌ఆర్ వెలుపల ఉన్న ప్రాంతాన్ని రూరల్ క్లస్టర్‌గా విభజించేందుకు సిద్ధమవుతున్నది. దీనిలో భాగంగా ట్రిపుల్‌ఆర్ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయడంపై సీఎం రేవంత్ ఇటీవల అధికారులతో చర్చించారు.

తెలంగాణలో 4వ పారిశ్రామిక విప్లవ కేంద్రం!

- ఫిబ్రవరి 28న బయో ఏషియా సదస్సు సందర్భంగా ఏర్పాటు
- ఆరోగ్య సంరక్షణ రంగంలో ఇదే తొలి సీ4ఐఆర్ సెంటర్
- డబ్ల్యూఈఎఫ్ వేదికగా ఒప్పందం
- ఆరోగ్య సంరక్షణ రంగంలో సాంకేతికాభివృద్ధికి దోహదం
- ఫోరమ్ చీఫ్ బొర్గె బ్రెండే, సీఎం రేవంత్‌రెడ్డి సంయుక్త ప్రకటన

దావోస్ సదస్సులో బోర్గ్ బ్రెండెతో సమావేశమైన సీఎం రేవంత్‌రెడ్డి, జయేశ్‌రంజన్

హైదరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో 'సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రెవల్యూషన్' (నాలుగో పారిశ్రామిక విప్లవ కేంద్రం-సీ4ఐఆర్)ను ఏర్పాటుచేయనున్నట్టు వరల్డ్ ఎకనమిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) ప్రకటించింది. బయో ఏషియా-2024 సదస్సులో భాగంగా ఫిబ్రవరి 28న ఈ సెంటర్‌ను ప్రారంభించనున్నట్టు తెలిపింది. ఆరోగ్య సంరక్షణ, లైఫ్‌సైన్సెస్ రంగాల్లో సాంకేతిక వినియోగాన్ని అభివృద్ధి పరిచేందుకు సీ4ఐఆర్ దోహదపడనున్నది. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో నిర్వహిస్తున్న (డబ్ల్యూఈఎఫ్) సదస్సులో ఈ మేరకు ఒప్పందం కుదిరింది. డబ్ల్యూఈఎఫ్ ప్రెసిడెంట్ బోర్గే బ్రెండే బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చలు జరిపిన అనంతరం ఈ మేరకు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. వరల్డ్ ఎకనమిక్ ఫోరం విశాల దృక్పథం, నిర్దేశించుకున్న లక్ష్యాలన్నీ తెలంగాణ ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా ఉన్నాయని చెప్పారు. ఇరువురి భాగస్వామ్యంతో ప్రజలకు ఆరోగ్యం, సాంకేతికత, మంచి జీవితం అందించాలనే లక్ష్యాలను వేగంగా అందుకోవచ్చు.

హెల్త్‌టెక్ హబ్‌గా తెలంగాణ: శ్రీధర్‌బాబు

తెలంగాణను హెల్త్‌టెక్ హబ్‌గా, హెల్త్‌టెక్ రంగానికి ప్రపంచ గమ్యస్థానంగా మార్చడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టిందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు కూడా హెల్త్‌టెక్ సేవలను అందించే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదని పేర్కొన్నారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం సెంటర్ ఫర్ హెల్త్ అండ్ హెల్త్‌కేర్ హెడ్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు డాక్టర్ శ్యామ్‌బిషెన్ మాట్లాడుతూ.. హెల్త్‌టెక్, లైఫ్‌సైన్సెస్‌రంగంలో నాయకత్వం వహించేందుకు అవసరమైన అర్హతలు భారతదేశానికి ఉన్నాయని, అందులో తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉన్నదని కొనియాడారు.

పలువురు ప్రముఖులతో రేవంత్‌రెడ్డి భేటీ

దావోస్ సదస్సులో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర ప్రతినిధి బృందంతో కలిసి పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఐటీ, వైద్య, జీవశాస్త్ర రంగాలకు ముఖ్య కేంద్రంగా అభివృద్ధి చెందిన తెలంగాణ బలాలను ప్రపంచానికి చాటి చెప్పడం ద్వారా భారీ పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో తెలంగాణ ప్రతినిధి బృందం తొలి రోజునే పలువురు ప్రముఖులతో కీలక చర్చలు జరిపింది. సోమవారం వరల్డ్ ఎకనమిక్ ఫోరం ప్రెసిడెంట్ బోర్గ్ బ్రెండెతోపాటు నిర్వాహకులు, ఇతర ప్రముఖులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. అనంతరం ఇథియోపియా డిప్యూటీ ప్రధాని డెమెక్ హసెంటోతో భేటీ అయ్యారు. పారిశ్రామిక అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ఎంచుకున్న రూట్‌మ్యాప్‌పై ఆయనతో చర్చించారు. అనంతరం నేషనల్ అసోషియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్ (నాస్కాం) ప్రెసిడెంట్ దేబ్జానీఘోష్‌తో సమావేశమయ్యారు. ఇంజినీరింగ్, డిగ్రీ కోర్సులు చదువుతున్న యువతకు స్కిల్ డెవలప్‌మెంట్, ప్లేస్‌మెంట్ కమిట్‌మెంట్, విలువైన ఉద్యోగాల కల్పనకు సాయం అందించే అంశాలపై చర్చించారు. కాగా.. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సు సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ పెవిలియన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'వేర్ ట్రెడిషన్ మీట్స్ ఇన్నోవేషన్' అనే ట్యాగ్‌లైన్‌తో ఈ ప్రత్యేక వేదికను ఏర్పాటు చేశారు.

సీ4ఐఆర్ సెంటర్‌కు కేసీఆర్ హయాంలోనే బీజం

వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఫోర్త్ ఇండస్ట్రియల్ రెవల్యూషన్ (4ఐఆర్) నెట్‌వర్క్ ప్రపంచంలోని ఐదు ఖండాల్లో విస్తరించి ఉన్నది. హైదరాబాద్‌లో నెలకొల్పనున్న సీ4ఐఆర్ సెంటర్ ప్రపంచంలో 19వది. హెల్త్‌కేర్, లైఫ్‌సైన్సెస్ నేపథ్యంతో ఏర్పాటవుతున్న మొదటి కేంద్రం కూడా ఇదే. ఈ సెంటర్ ఏర్పాటునకు కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే బీజం పడింది. అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ రాష్ట్రంలో హెల్త్‌కేర్, లైఫ్‌సైన్సెస్ రంగాల అభివృద్ధికి విశేషంగా కృషిచేశారు. ప్రపంచంలోని ప్రఖ్యాత కంపెనీల పెట్టుబడులను ఆకర్షించేందుకు బలమైన ఎకోసిస్టంను ఏర్పాటు చేశారు. దీంతో తెలంగాణ రాష్ట్రం ఆసియాలోనే లైఫ్‌సైన్సెస్ హాట్‌స్పాట్‌గా ఎదిగింది. ముఖ్యంగా కేటీఆర్ వరుసగా దావోస్ సదస్సులకు హాజరవడంతో పాటు రాష్ట్రంలో ఏటా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా బయో ఏషియా సదస్సును నిర్వహిస్తూ రాష్ట్ర కీర్తిని ప్రపంచానికి చాటారు. ఫలితంగా గడచిన ఐదేండ్లలో ఒక్క లైఫ్ సైన్సెస్ రంగంలోనే తెలంగాణకు రూ.25 వేల కోట్ల పెట్టుబడులు, సుమారు 1.30 లక్షల ఉద్యోగావకాశాలు వచ్చాయి. 2017లో కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేకంగా మెడికల్ డివైజెస్ పార్క్‌ను ఏర్పాటుచేసింది. ప్రస్తుతం ఇది దేశంలోనే అతిపెద్ద మెడ్‌టెక్ ఆర్‌అండ్‌డీగా అవతరించింది. ఆసియాలోనే అతిపెద్ద స్టెంట్ల తయారీ సంస్థ కూడా తెలంగాణలో ఏర్పాటైంది. రాష్ట్రంలో 50కి పైగా ఆర్‌అండ్‌డీ కంపెనీలు కొలువుదీరాయి. టీ-వర్క్స్ పేరుతో దేశంలోనే అతిపెద్ద ప్రోటోటైపింగ్ సెంటర్‌ను కేసీఆర్ ప్రభుత్వం నెలకొల్పింది. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన బయోఏషియా సదస్సులో బిల్‌గేట్స్, సత్య నాదెళ్ల, వాస్ నరసింహన్ వంటి అనేకమంది ప్రపంచ దిగ్గజాలు పాల్గొనడం విశేషం. లైఫ్‌సైన్సెస్ రంగంలో గత కేసీఆర్ ప్రభుత్వం సాధించిన విజయాల్లో ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. ఈ నేపథ్యంలోనే సీ4ఐఆర్ ఏర్పాటు కోసం తెలంగాణలో అప్పట్లోనే బలమైన పునాదులు పడ్డాయి. సీ4ఐఆర్ స్వయం ప్రతిపత్తి కలిగిన, లాభాపేక్ష లేని సంస్థగా పేరొందింది.

పచ్చిమాంసం తినొద్దంటే.. చంపేశాడు

- కత్తితో దాడి.. భర్త మృతి..
- భార్యకు గాయాలు
- అడ్డగుట్టలో దారుణం

అడ్డగుట్ట, జనవరి 16: పచ్చిమాంసం ఎందుకు తింటున్నావని అడిగిన పాపానికి ఓ యువకుడిని కత్తితో పొడిచి చంపాడు. ఈ దారుణ ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకున్నది. తుకారాంగేట్ గోల్‌బావి ప్రాంతానికి చెందిన కాంబ్లే అజయ్ (23) భార్య ప్రియాంక, కుమార్తె అక్షిత (8 నెలలు)తో కలిసి నివాసముంటున్నాడు. సోమవారం అదే ప్రాంతానికి చెందిన చారి (43) ఇంటి బయట కూర్చొని పచ్చిమాంసం తింటున్నాడు. ఇది గమనించిన అజయ్, ప్రియాంక పచ్చిమాంసం ఎందుకు తింటున్నావని ప్రశ్నించగా కోపోద్రిక్తుడైన చారి పక్కనే ఉన్న కూరగాయల కత్తితో అజయ్‌ని కడుపులో పొడిచాడు. అడ్డువచ్చిన ప్రియాంకపై కూడా దాడి కి పాల్పడటంతో స్వల్పంగా గాయపడింది. గాంధీ దవాఖానకు తరలించగా, అప్పటికే అజయ్ మృతి చెందినట్టు వైద్యులు వెల్లడించారు.

కోలాటమాడుతూ కుప్పకూలిన మహిళ

దవాఖానకు తరలించేలోపే మృత్యు ఒడికి.. కరీంనగర్ జిల్లా కల్వలలో విషాదం

రాజమణి (ఫైల్)

శంకరపట్నం, జనవరి 16: భోగి పండుగనాడు తోటివారితో సంతోషంగా కోలాటమాడుతున్న ఓ మహిళ కు